# విరామ సంగీతం



**-గుమ్మా ప్రసాదరావు**

## రచయిత:

ఈ మధ్య పత్రికలో పడ్డ 'నేపథ్య సంగీతం', 'లలిత సంగీతం' లాంటి కథలు చదివిన నాకుకూడా అదే మోస్తరు కథ వ్రాయాలనిపించింది. అయితే, కథలు వ్రాయడంలో నేను ఇంకా అక్షరాభ్యాసంకూడా చెయ్యలేదు. మరి నా ఉద్దేశం ఊహల్లో పుటుక్కుమని పోవలసిందేనా? బి. ఏ. వరకు చదివి కొన్ని వందల కథలు, నవలలు చదివిన నేను కథ వ్రాయలేనా? ఎందుకు ప్రయత్నించకూడదూ అన్న దురాశ కలిగింది. అందుకనే కాగితం, కలం తీసుకుని కూర్చున్నాను. ఆదిలోనే హంస పాదు అన్నట్టు సంశయం నన్ను వేధించింది—కథ వ్రాసి శీర్షిక పెట్టాలా లేక శీర్షిక వ్రాసి తదనుగుణంగా కథలు వ్రాయాలా? ఏమైనా, ఇది నా కథా రచనకు నాంది ప్రస్తావన. వ్రాయాలనే నిశ్చయించుకున్నాను. పై రెండు ప్రక్రియల్లో ఏదైనా చివరకు మిగిలేది కథే.

నా బుర్ర కొంచెం జోరుగా పని చేసింది— కప్పు కాఫీ, రెండు సిగరెట్లు పూర్తి చేసేసరికి. సంగీతం అన్న పదం ఆఖర్న రావాలన్న తలంపు తోనే ఈ రచనకు ఉపక్రమించాను కాబట్టి శీర్షికను ముందుగా ఎన్నుకుంటే కథ దానిని బట్టి అల్లుకు పోవచ్చు. ఈ తలంపు రాగానే 'శభాష్, మూర్తీ! నీ బుర్ర అమోఘంగా పని చేస్తోందోయ్. ఊఁ కానీ' అంది నా అంతరాత్మ, నీవు తట్టకుండానే. ఒక్క మనవి. శీర్షికలో సంగీతం ఉన్నా, కథలో సంగీతానికి తావు ఉండదు. ఇది పదహారణాల (నీకీ, నూరు పైసల) వచనం.

పాఠక మహాశయులారా! నా రచనను గురించి మీకు అనుమానం కలుగుతూందా? తొలి రచనే కావచ్చు. అయినా, ఈ కథ మీకు బాగా నచ్చుతుందని

ముందుగానే హామీ ఇస్తున్నాను, పత్రిక వాళ్ళకు నా స్వంత కథ అని హామీ ఇచ్చినట్లు. ఒక వేళ కథ బాగుండదని నాకు తోస్తే అక్కడే పాతి పెట్టేస్తాను కాని, చెత్త కథను ఆసాంతం మీరు చదవ నవసరం ఉండదు.

అన్నట్టు నేను జపం విడిచి లొట్టల్లో పడుతున్నాను. ఇక అసలు కథకు వస్తాను.

ఇది కథ కాదు.

ఎప్పుడో, ఎక్కడో జరిగింది కాదు.

నా పరిసరాల్లో, నా కళ్ళ ముందు జరుగుతున్న యథార్థ గాథ. రెండు ప్రేమజీవుల నిజ వృత్తాంతం. ఇక కథ పేరు—మీకుతెలుసు. కోపగించుకోకండి—నేను ముందే వ్రాశాను మీరు చూసే ఉంటారు.

ఎలాగుంది నా సెలక్షను?

విరామ సంగీతం అంటే రేడియోలో ప్రోగ్రామ్‌కి, ప్రోగ్రామ్‌కి మధ్య వినిపించే ట్యూనుల గురించి అని అనుకుంటే మీరు పొరపాటు పడ్డట్టే. అనుకున్న కార్యక్రమాన్ని అనుకోని అవాంతరాల వలన వినిపించలేక బదులుగా ప్రసారం చేసిన సంగీతం లాంటి దని ఊహించు కుంటే మీరు నిజంగానే అపోహ పడ్డట్టే. నా వెర్రి కాని, మీ రలా ఎందుకు ఊహిస్తారు? నేను ముందే వ్రాశానుగా ఇది సంగీత ప్రధానం కాదని?

ఇక అసలు విషయం— అదే మనవి చేసు(్త)న్నాను. ఇద్దరు ప్రేమికుల (?) జీవితంలో ఓ ఘట్టం.

ఉపోద్ఘాతం పెద్ద దయిందా? ఏమిటో బోరుకూడా కొడుతున్నదా? అయ్యో! (?) క్షమించండి. ఇంక మరొక్క ముక్కకూడా వ్రాయను. వెంకట్రామయ్యతో పరిచయం చేస్తాను. పదండి.

## వి. రామ:

ఈ రచయిత చాలా పెడసరి వాడు లాగున్నాడే! "బాబూ! నీ మీద కథ రాస్తాను, నా కొంచెం వివరా లిస్తావా?" అని ఏవేవో ఊక దంపుడు ప్రశ్నలు వేసి నన్ను మీ ముందు జడ్జీ ముందు దోషిలా నిలుచోపెట్టి ఫేడౌటు అవుతాడా? అచ్చులో నా కథ చూసి మురిసి పోవచ్చను కున్నాను. రచయిత నల్ల పూసై పోయాడు. ఇంకే నా కథేం వ్రాస్తాడు?

పోనీ, ఎలాగూ పాఠక మహాశయుల ముందు దోషిగా నిలుచున్నాను. ఆ రచయితతో నాకు జరిగిన ఇంటర్వ్యూ చెప్పేస్తాను. కాని, ఇందులోనూ కొంత చిక్కు ఉంది. అతను అల్లి బిల్లిగా అడిగిన ప్రశ్నలు నాకు జ్ఞాపకం లేవు. కానైతే నేను చెప్పిన జవాబులు మాత్రం కొంచెం కొంచెం గుర్తు. అవే ఇవి:

"..."

"నా పేరు మీకు తెలియకనే అడుగుతున్నారా? బాబూ! వెంకట్రామయ్య అంటే నువ్వేనా అని మీరే అన్నారుగా? నా పేరు పొడిగా వి. రామ. పూర్తి పేరు మీకు తెలుసుగా?"

"..."

"నా మీద కథ రాస్తానంటే వద్దంటానా? నిక్షేపంలా రాయండి."

"..."

"మీరు రాసేది నా కథ. మరి నా తల్లిదండ్రుల పేర్లెందుకు?"

"..."

"కోపం తెచ్చుకో లేదండి. అయినా, వాళ్ళ పేర్లు చెప్పడం నా కిష్టం లేదు."

"..."

"అమ్మయ్య! వాళ్ళపేర్లు చెప్పక పోయినా రాస్తా నన్నారు. ఏమోనండీ. మా అమ్మను, నాన్నను పత్రిక కెక్కించడం నా కిష్టం లేదండీ."

"..."

"పి. యు. సి. పరీక్షకు ఈ ఏప్రిల్లో వెళ్ళాను. ఇంకా రిజల్ట్సు రాలేదు."

"..."

"అబ్బే! చదివించే తాహతు మా వాళ్ళకున్నా, చదివే శక్తి నాకు లేదండీ."

"..."

"ఉద్యోగం దొరికితే చేస్తానండీ."

"..."

"నాకు త్వరగా ఉద్యోగం దొరక్కపోయినా బాధ లేదండి. మా వాళ్ళకు నే నొక్కడినే."

"..."

"పెళ్ళి మీద నాకు స్థిరమైన అభిప్రాయం ఏదీ లేదండీ."

"..."

"మీ రన్నట్టు—ప్రేమించి పెళ్ళాడ్డంలో కొంచెం ఆనందం ఉంది. కాని, అందరికీ ఆ అదృష్టం దొరకద్దూ?"

"..."

"నే నండీ—ప్రేమించానా అంటారా? దానికి ఇదమిత్థంగా సమాధానం చెప్పడం కష్టమండీ."

"..."

"అంటే మరేం లేదు. అందరూ కాకపోయినా కొందరు విద్యార్థుల్లా నాకూ ఓ అమ్మాయితో పరిచయం, స్నేహం ఉన్నాయండీ. ఏవేవో కల లోసుకున్నాం. పెళ్ళాడాలనికూడా నిర్ణయించు కున్నాం. కాని, ఆ పిల్ల మా వాళ్ళకు నచ్చాలిగా?"

"..."

"అబ్బే! ఆ అమ్మాయితో మా వాళ్ళ ఇష్టా యిష్టాల గురించి ప్రసక్తి రాలేదండీ. ఏదో సరదాకు చేసిన స్నేహం చాలా దూరం నడిచిన మాట యథార్థం."

"..."

"మా వాళ్ళకు చెప్పకేమండీ! కాని, ప్రేమ. . . ప్రేమ పెళ్ళి అంటే మా నాన్నకు ఎలర్జీగా ఉందండీ. ఒప్పించ లేకపోతానా అనుకున్నాను. కాని, అతను తన పట్టు సడలించలేదు."

"..."

"ఏం చేస్తాను? మీ రన్నట్టు మా వాళ్ళతో తెగతెంపులు చేసుకుని ఆ పిల్లను చేసుకోలేను. మా వాళ్ళకు నచ్చిన సంబంధం చేసుకుంటాను."

"..."

"ఆ అమ్మాయిని మోసం చెయ్యటం లేదే? మా వాళ్ళు ఒప్పుకుంటే ఆమెనే చేసుకోవాలను కున్నాను."

"..."

"కట్నం నా. కక్కర లేదండి. అవన్నీ మా నాన్నగారే చూసుకుంటారు. కట్నం ఆశించి నే నా అమ్మాయిని కాదన్ను కోవడం లేదు. కేవలం మా నాన్న అనుమతించక పోవడం వల్లనే."


"..."

"బాగుంది. మన ఆచార వ్యవహారాల మేరకు పెళ్ళి చూపులు ఉంటాయి. నాకు నచ్చక పోతే అన్న ప్రశ్న లేదు. ఎందుచేతనంటే మా వాళ్ళు ఇష్టపడ్డారు. ఇది వట్టి ఫార్మాలిటీయే."

ఇంకా నయం నేను ఆ అమ్మాయి పేరు బయట పెట్టలేదు. ఈ రచయిత నన్ను బలే మస్కా కొట్టి కాఫీ, టిఫిన్లు ఉల్పాగా చేసి వెళ్ళి పోయాడు.

## రచయిత:

ఇదండి వి. రామ అభిప్రాయం. ఎవరో అమ్మాయిని ప్రేమించి, ఆమెకు ఏవేవో ఆశలు కల్పించి, బాసలు చేసి, ఇప్పుడు బాధ్యత తనది కాదు—తను ఆ శ్రీరామచంద్రమూర్తిలా తండ్రి మాట జవ దాటలేకనే ఆ పిల్లను చేసుకోను అని నిక్కచ్చిగా బల్ల గుద్ది చెప్పి వేశాడు. ఆ మాత్రం ఇంగితజ్ఞానం మొదటే లేకపోయిందా? ఇతని మీద ఏవేవో ఆశలు పెట్టుకుందే ఆ పిల్ల? మనసా



బావా ఇతడినే తన భర్త గా భావించుకుని ...మని కలలు కంటూ ఉందే? ఇప్పు డామె గతేం కాను?

నేను మాత్రం ఏం ఊహించగలను?

ఆ అమ్మాయినే స్వయంగా కలుసు కుని, తెలుసుకుని మీకు వ్రాసి చేస్తాను. ... రామ చెప్పినంత మాత్రాన ఆ ... పేరూ, అడ్రసూ తెలుసుకోలేనా? రవి గాంచనిది కవికూడా కాంచ గలడన్న సామెత ఊరికే రాలేదు. నాకు తెలిసింది వెంకట్రావు ప్రేమించిన అమ్మాయి పేరు సంగీత. అందుకే నేను సంగీతను కలుసుకుందామని వాళ్ళ ఇంటికి వెళ్ళాను. నేను వెళ్ళినప్పుడు పరిస్థితి ఎలాగుం దంటే ఆ సందర్భంలో ఆమెతో నాకు ఇంటర్వ్యూ కుదర లేదు. కారణం ... మరేమీ లేదు. అదే వ్రాస్తున్నాను. చిత్తగించండి.

అదొక మధ్య తరగతి గృహస్థు ఇల్లు. ముందు గది పెళ్ళి చూపుల కోసం అమర్చినట్లు కనుపిస్తున్నది. నే నిలా ఊహించడానికి కారణం లేక పోలేదు. ఆ ఇంట్లో వంట గదితో పాటు మూడే మూడు గదు లున్నాయి. ముందు గది—అదే, ఇప్పుడు అలంకరించి ఉన్న గదిలో ఓ మూలగా పెట్టె బేడా కుప్పగా కూర్చి వాటి మీద ఒక తెల టి దుప్పటి కప్పి ఉంది. గది మధ్య నాలుగు కుర్చీలు— రెండు క్రరవి, రెండు ఇనుపవి, ఒక టీపాయి అమర్చి ఉన్నాయి. ఓ వారగా? జంబుఖానా పరిచి ఉంది. ద్వారబంధా లకు తెరలు వేలాడుతున్నాయి, వెనక గదిలో ఆడవాళ్ళ గాజుల చప్పుళ్ళు, మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

నన్ను చూడగానే ఆ గృహస్థు ఆప్యా యంగా ఆహ్వానించారు. అయితే, అతని ...ల్లో ఆందోళన, ఆత్రత కొట్టవచ్చి నట్లు కనుపించాయి.

"రండి, రండి! ఒక్కరే వచ్చారే! అబ్బాయి రాలేదా? మీ ఆడవాళ్ళు రాలేదా? ఇల్లు కనుక్కోవడం కష్టం క లేదుగా? హైస్కూలు టీచరు ప్రకాశ రావు ఇల్లంటే ఎవరైనా చెప్పి ఉంటారు లెండి."

పాఠక మహాశయులారా! ఈ పాటికి మీరు సంగతి సందర్భం అర్థం చేసుకుని ...వారు. సంగీతను చూసుకుందుకు ...రో పెళ్ళి వారు ఆ సమయంలో ...న్నారు. నేను కానిసమయంలో ...చ్చాను. ఏమని సమాధానం చెప్పను? ... సంగీతతో సంప్రదించేందుకు అనువైన వేళ కాదు. నేను మౌనంగా కూర్చోవడంతో ప్రకాశరావుగారిలో కంగా రెక్కువైంది.

"బావగారూ!"

"..."

"మీకు మా సంబంధం నచ్చ లేదన్న మాట. ఆ మాట చెప్పడానికి మీరు ఇంత దూరం రావాలా? కార్డు ముక్క రాస్తే సరిపోయేదిగా? ఏమిటో మా అమ్మాయికి ఆ కళ్యాణం ఎప్పుడు రాసి ఉందో! ?"

అది స్వగతమో, ఆత్మ వేదనో!

ఇంక నా మౌనం భావ్యం కాదు. కాని, నేను పెదవి విప్పేలోగా లోనుంచి కొంచం పెద్దగానే సంగీత గొంతు వినిపించింది.

## సంగీత:

నా మాట మీరు వినిపించుకో రేం? నా కీ సంబంధం సుతరాం ఇష్టం లేదు. నేను అసలు పెళ్ళే చేసుకోను. నేను మనసు పడి చేసుకోవాలనుకున్న అబ్బాయిని కాదని ఎవరో ముక్కు మొహం ఎరగని వ్యక్తిని పెళ్ళి చేసుకో లేను. నా పెళ్ళే ముఖ్య మనుకుంటే నా పెళ్ళి వెంకట్రామారావుతో చెయ్యండి. నేను మనస్ఫూర్తిగా చేసు కుంటాను. మా ఇద్దరి మనసులు పెన వేసుకున్నాయి. ఒకరి కొకరం మనసారా ప్రేమించుకున్నాం. ఇలా ఇద్దరు ప్రేమి కుల్ని విడదీయడానికి మీకు మనసెలా వస్తున్నది? అతని కేం తక్కువ? పి. యు. సి. చదివాడు. తల్లిదండ్రుల కొక్కడే సంతానం. కావలసినంత ఆస్తి ఉంది, అందం ఉంది. పైగా నే నంటే పడి చస్తాడు. మీ బలవంతం మీద వాళ్ళ ముందు నన్ను పెళ్ళి చూపులకు కూర్చో పెడితే నిర్మొహమాటంగా ఈ మాటలే చెప్తాను. మీకు తలవంపులే కావాలను కుంటే మీ ఇష్టమే కానీయండి.

## రచయిత:

సంగీత తల్లి ఏదో మృదువుగా చెప్పింది. గొంతు మెల్లగా ఉండడం వలన నాకు ఆమె మాటలు వినిపించ లేదు. బహుశా తనను అప్రతిష్ఠ పాలు చెయ్యవద్దని బతిమాలి ఉంటుంది. ప్రకాశరావు గారిలో కంగారు మరింత ఉధృతమైంది. తల చేత్తో పట్టుకుని కుర్చీలో కూలబడి పోయారు.

"ప్రకాశరావుగారూ! మీరు ఎదురు చూస్తున్న పెళ్ళివారు ఇంకో క్షణంలో రావచ్చు. నేను వారి తరఫున రాలేదు. మీరు నిరాశపడ నవసరం లేదు. నేను వేరే విషయమై వచ్చాను. మీరు నన్ను చూసి పెళ్ళివారేనని పొరపాటు పడ్డారు" అన్నాను.

ప్రకాశరావుగారి ముఖం చేటంత అయింది.

"అలాగా! ఇంకా వాళ్ళేనేమో నను కున్నాను. బలే కంగా రెత్తించారు! ఇంతకూ మీరు వచ్చిన పని?"

"మీరు పెళ్ళి చూపుల హడావిడిలో ఉన్నారు. మరో మారు వీలు చూసుకుని వస్తాను" అన్నాను. సంగీత పెళ్ళికి సుముఖంగా లేదు. వెంకట్రావు మీద ఆశలతో తల్లిదండ్రుల్ని ప్రతిఘ టిస్తోంది. ఇటు లతడు తండ్రి ఆజ్ఞ అంటూ ఈమెను మరిచి పోతున్నాడు. ఈమె గతేం కాను? ఈ విపత్కరం నుంచి వాళ్ళను ఎలా కాపాడడం? నా చేతిలో ఏముంది? అనుకున్న విధంగా ముగించేయడానికి ఇది కథ కాదే! నిండు జీవితాల బాధామయ గాథ.

ప్రకాశరావుగారికి నాలో ఏం మంచి కనుపించిందో—"అయ్యా! ఎలాగూ సమ యానికి వచ్చారు. మీరు చూడబోతే నాకు చాలా ఆప్తుల్లా ఉన్నారు. ఆ పెళ్ళి వారు వచ్చే వరకు ఉంటే బాగుం టుంది. నాకు ఇలాంటి విషయాల్లో అనుభవం లేదు. మీరూ ఉంటే నాకు కొండంత ధైర్యం ఉంటుంది" అన్నారు.


"మీ కంటే చిన్నవాడిని. నన్ను ఉండమనడం భావ్యం కాదు. కాకపోయినా, నాకు మాత్రం ఏం అనుభవం ఉంది?"

"అలా కాదు. ఒకరి కొకరం. కూర్చోండి. వాళ్ళు వచ్చే వేళకూడా అయింది" అని బలవంతం చేశారు. నేను విధిలేక కూర్చున్నాను. అయితే, అలా కూర్చోవటంలో కొంచెం నా స్వార్థంకూడా ఉంది. నా కథ కో తుది మెరుగు ఈ పెళ్ళి చూపులేగా!

సంగీత నిజంగానే ప్రతిఘటి స్తుందా?

లేక వచ్చిన అబ్బాయిని చూసి మనసు మార్చుకుని మనువుకి సిద్ధమౌతుందా?

ఒక వేళ తన పంతం ప్రకారం వెంకట్రావును పెళ్ళి చేసుకోవాలంటే ఆమె ముందు అడుగు ఎలా ఉంటుంది?





బాపూజీ     చిత్రం—గంగా ( మద్రాసు—26 )

ఈ ప్రశ్నలకు జవాబు నాకు ఇప్పు డేగా దొరికేది!

తిరిగి సంగీత ఏడుస్తూంది. అస్ప ష్టంగా అంటూంది. ప్రకాశ రావుగారు లోనికి వెళ్ళారు. తిరిగి బయటి కొచ్చి గాభరాగా వీథిలోకి వెళ్ళి వచ్చారు. వస్తూ వస్తూ తలుపు గడియ వేసి మరీ వచ్చారు.

"బాబూ!"

"నా పేరు మూర్తి."

"ఆ. మూర్తి గారూ! చెప్పొచ్చేదేమి టంటే అమ్మాయికి ఈ సంబంధం ఇష్టం లేదట. అబ్బాయి కొద్దో గొప్పో చదువు కున్నాడు. అతడి తండ్రికి బాగా ఆస్తి పాస్తు లున్నాయి. ఇత డొక్కడే సంతానం. అలాంటి చోటపడితే అమ్మాయి సుఖ పడుతుందని తాహతుకి మించి కట్నం పోసైనా పెళ్ళి చెయ్యా లనుకుంటున్నాను. కాని, అమ్మాయే మొండి కేసింది. కాస్త నచ్చ చెప్పి చూడండి."

నాకు మతి పోయింది. తల్లిదండ్రులు చెపితేనే ఇష్టపడని ఆ పిల్ల నా మాట విన్నిస్తుందా? నన్నూ, నా మధ్యవర్తిత్వాన్నీ దులపరిస్తే, ఎంత అపఖ్యాతి! ఏం చెయ్యాలో పాలు పోలేదు.

"నాన్నగారూ! నా కెవ్వరూ నచ్చ చెప్పనవసరం లేదు. నే నీ పెళ్ళి చేసు కోను" అంది సంగీత, ఉరుము లేని పిడుగులా ముందు కొచ్చి.

"అమ్మా! సంగీతా! అంత ఆవేశం పనికి రాదు. నీ నాన్నగారు నీ మంచి కోరే చెపుతున్నారు. ఏదో తెలియని చిన్నతనంలో నువ్వు కాదంటున్నావు. నీ బాగు కోరి చెప్పిన వారి మాటలు పెడ చెవిని పెయ్యకు" అన్నాను.

"అలా బుద్ధి చెప్పండి. ఏమిటో చదవేస్తే, ఉన్న మతి పోయిందన్నట్లు నిక్షేపం లాంటి ఈ సంబంధాని కేం వంక లున్నాయి? అసలు అబ్బాయిని చూడనైనా చూడకుండా ఏమిటీ పిచ్చి?" అంది ప్రకాశరావుగారి భార్య.

"ఒక వేళ అమ్మాయి మరే కుర్రాడి నైనా ప్రేమించిందేమో!" ఇదే అదనుగా భావించి అన్నాను.

"నిండా పదిహేడేళ్ళు లేవు. ప్రేమట ప్రేమ" అంది ఆవిడ, కోపాన్నంతా ముక్కుపుటాల్లో బిగించి.

"ప్రకాశరావుగారూ! విషయం పూర్తిగా కాకపోయినా నాకు కొంచెం అర్థం అయింది. మీ అమ్మాయి ఇంతకు క్రితమే వేరొక అబ్బాయిని ప్రేమిం చింది. వాళ్ళ స్నేహం ప్రణయం వరకు దారి తీసింది. ఏవేవో బాసలు చేసు కున్నారు. అందువలన సంగీత ఈ పెళ్ళికి సుముఖం కాలేదు. అవునా, తల్లీ?" అన్నాను.

ఔనని తల ఊపింది సంగీత.

అనుకోకుండా దొరికిన అవకాశాన్ని జార విడుచుకోరా దనుకున్నాను.

"అమ్మా! సంగీతా! నువ్వు ఆ అబ్బాయి మీద' మోజుతో తల్లి దండ్రులు తెచ్చిన నిక్షేపం లాంటి సంబంధం విడిచి వేస్తున్నావు. నీ స్నేహితుడు కేవలం ఓ మోసకారి.'

"కాదు. అతడిని నేను బాగా ఎరుగ' దును. అతను మోసకారి కాడు" అంది ధీమాగా. "అక్కడే నీవు పొరపాటు పడు తున్నావు. ఇంతకు క్రితమే నేను వెంకట్రామాన్ని కలుసుకున్నాను. నిన్ను ప్రేమించానని చెప్పుకోవటంలో అతను అసత్యం లేదన్నాడు. కాని, పెళ్ళి చేసుకో లేకపోయినందుకు బాధ పడటం లేదు. ఇది మాత్రం సత్యం. అతడు తండ్రి మాట జవదాట లేడట. వారిని కష్ట పెట్టడం భావ్యం కాదట. అందుచేత తన ప్రేమకు స్వస్తి వాచకం పలికి పెళ్ళి చూపుల ప్రయత్నంలో ఉన్నాడు. ఇది యథార్థం. అందుచేత నీవు ఈ సదవకాశం జార విడుచుకోకు. ఒక పిరికిపంద కోసం నీ జీవితాన్ని నాశనం చేసుకోకు" అన్నాను హిత బోధగా. ఆ తరవాత అక్కడ ఉండడం భావ్యం కాదని వెళ్ళిపోయాను.

నేను గేటు దాటుతూండగా వెంక ట్రామం తల్లి, తండ్రితో సహా ఆ ఇంటి ముందు రిక్షా ల్లోంచి దిగాడు. నాకు మరో మారు మతి పోయింది. అయితే, ఈ వెంకట్రామం సంగీతను చూసు కుందుకు వచ్చా డన్నమాట!

బాగు, బాగు! రోగి కోరిన ఔషధం వైద్యు డిచ్చినట్లు సంగీతను ప్రేమించిన ప్రియుడినే వరుడుగా పెళ్ళి చూపులకు కుదిర్చారు ప్రకాశరావుగారు.

ఇంకేం? నిశ్చయ తాంబూలాలు పుచ్చేసుకుని ఉంటారు.

ఈ సంఘటన ఇంతటితో ఆగి పోయి ఉంటే నేను ఈ కథను వ్రాయకనే పోదును. ఎందుచేత నంటే ఇందులో మలుపు లేదు, థ్రిల్ లేదు.

• • •

కాలగర్భంలో మరో రెండేళ్ళు గడిచి పోయాయి. పని మీద ఊరి కెళుతున్నాను రైల్లో. అప్పుడు జరిగిన సంఘటన చెప్పి నా కథ కొక ఫుల్‌స్టాప్ పెడతాను.

"నమస్కారం, బాబాయిగారూ!"

ఎవరా అని చూశాను. చంకలో చంటి పాపతో సంగీత ఎదురు బెర్తు మీద కనుపించింది.

"ఓహో! సంగీతా! నువ్వా? నన్ను జ్ఞాపకం ఉంచుకున్నావా? చాలా సంతో షం. వాడు నీ కొడుకేనా?"

"కాదు. అమ్మాయి" అంది ముసి ముసిగా నవ్వుతూ.

"అన్నట్టు, ఆ నాడు నిన్ను చూసు కుందుకు వెంకట్రామమే వచ్చాడుగా? మొత్తానికి ఆ విధంగా ఆ దైవం మిమ్మల్ని కలిపాడన్న మాట. ఇటు నీ పంతం చెల్లింది. అటు నీ నాన్న కోరికా నెర వేరింది. ఇంతకీ మీ ఆయన ఏం చేస్తు న్నాడు? తన కథ రాయలేదని బహుశా నన్ను తిట్టుకుని ఉండవచ్చు. ఏం చెయ్యను? మీ కథకు బొత్తిగా ముగింపు లేకుండా పోయింది. చచ్చు ప్రేమ కథైంది."

"బాబాయిగారూ! ఆ నాడు వెంక ట్రామ నన్ను చూసేందుకు రావటం నిజమే కాని, అతను నా భర్త కాలేదు."

"ఏమిటీ? !"

"అదే చెపుతున్నాను. అతని నైజం తెలిసిన తరవాత ఎలా చేసుకోను? ప్రేమ అంటూ నన్ను మభ్య పెట్టి కట్న కానుకల కాశించి పెళ్ళి చూపులకు రావడంతో నాకు తిక్క రేగింది. వెంక ట్రామాన్ని అక్కడే నాలుగు దులప రించాను. మా నాన్న, ఆ వెంకట్రామ నన్ను శత విధాల బతిమాలారు. నేను మొండి పట్టు వదలలేదు. ససేమిరా ఈ సంబంధం నాకు వద్దు అని చెప్పాను. మీరు చెప్పినట్లు అది ప్రేమ కాదు, ఆకర్షణ. ఆ వయసులో ఇద్దరు స్త్రీ—పురుషుల మధ్య ఉద్భవించేది ఆకర్షణ మాత్రమే. నిజమైన ప్రేమ వివాహా నంతరమే. ఆ తరవాత మరో రెండు మూడు సంబంధాలు తెచ్చారు. ఆఖరికి దీని నాన్నగారితో పెళ్ళి కుదిరింది. మీ అడ్రెసు తెలియక శుభలేఖ పంప లేదు."

మంచి ప్రోగ్రామ్ విందాం అన్న ఆసక్తితో రేడియో ట్యూను చేసుకు కూర్చున్న వారికి 'అనుకోని అవాంత రాల వలన ముందుగా ప్రకటించిన కార్యక్రమానికి బదులుగా ఈ విరామ సంగీతం వినిపిస్తున్నాం' అన్న అనౌన్స్ మెంటు లాగ అనిపించింది ఆమె సమా ధానం.

"బాబాయిగారూ! ఇప్పుడు మీరు కోరిన ముగింపు దొరికింది కథకు. పూర్తి చెయ్యండి. ఒక్క మాట. మీ రానాడు నాకు యథార్థ విషయం తెలియ బరచకపోతే నా బతుకు బండ లయ్యేది. వెంకట్రామ వట్టి పిరికి పందే కాదు, అతను జీవితం అంటే అర్థం చేసుకోలేని అవివేకి. ఒక సిద్ధాంతం, నిజాయితీ లేని వ్యక్తి. గాలి వాటుకి కొట్టుకు పోయే మనిషి. నిజంగా అతణ్ణి చేసుకోకపోవడం ఒక వరం. అతనితో పెళ్ళి కాని పక్షంలో నా జీవితం వ్యర్థమే అవుతుందని భ్రమ పడ్డాను. అది ఎంత తప్పో ఇప్పుడు నాకు బాగా అర్థమైంది అంది. ఇంతలో ఆమె దిగవలసిన స్టేషను వచ్చింది. ఆమె కోసం ఆమె భర్త వచ్చాడు. అతనికి నన్ను పరిచయం చేసింది.

"మీ గురించి సంగీత చాలా పర్యాయాలు చెప్పింది. తిరుగు ప్రయా ణంలో మీరు తప్పక ఇక్కడ దిగాలి" అన్నాడు అతను.

రై లు కూత వేసి బయలుదేరింది. *